క్లుప్తంగా

మందస ఇన్‌చార్జి ఎంఈవో-2గా సోలమన్



సోలమన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

మందస: మందస మండల ఎంఈవో-2గా (ఇన్‌చార్జి) బి.ఎస్.సోలమన్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయని ఎంఈవో-1 ఎం.లక్ష్మణరావు శనివారం తెలిపారు. సోలమన్ సోండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. కాగా బాధ్యతలు స్వీకరించిన సోలమన్‌ను ఎంఈవో కార్యాలయ సిబ్బంది డి.రాంబాబు, ఆర్.లవకుమార్, వై.జయరాం, ఎం.ఇందిరా, రమేష్, ఎమ్ఆర్‌సీ సిబ్బంది, సీఆర్పీలు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలతో మాట్లాడుతున్న రామ్మోహన్‌నాయుడు

టెక్కలి రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించి తమ కుటుంబాలకు ఆర్థికంగా తోడు ఉండేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని కేంద్ర విమానాయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని కోటబొమ్మాళి మండల కేంద్రంలోని సాయిరాం మందిరంలో శనివారం ప్రారంభించారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలనేది ప్రభుత్వ ఉద్దేశమని కేంద్రమంత్రి అన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు కల్పించాలని వినతి

కవిటి: మండలంలోని లండారపుట్టుగ, శిలగాం, బెలగాం, కన్నుపుట్టుగ, జగతి పంచాయతీల పరిధిలోని 22 గ్రామాల ప్రజలకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సీడాప్ మాజీ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం విశాఖపట్నం రీజనల్ ఆర్టీసీ శాఖ ఈడీకి వినతిపత్రం అందించారు. దీనిపై సానుకూలంగా స్పందించినట్టు శ్యాంప్రసాద్ తెలిపారు.

అనాథశ్రమానికి బియ్యం, దుప్పట్లు అందజేత



బియ్యం, దుప్పట్లు అందజేస్తున్న తిలక్

టెక్కలి: విజయనగరం జిల్లా వావిలవలసలోని రాహుల్ సౌరబ్ నిత్య అన్నదాన ఆశ్రమానికి వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ బియ్యం, దుప్పట్లు అందజేశారు. ఈ మేరకు శనివారం ఆశ్రమాన్ని సందర్శించి 100 కిలోల బియ్యంతో పాటు 50 దుప్పట్లు అందించారు. నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు టి.ఫాల్గుణరావు, నాయకులు కింతలి ధర్మారావు, చిన్ని జోగారావు, జద్యాడ జయరాం, టి.దేవేంద్రరావు ఉన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: తులసిగాం గ్రామానికి చెందిన సోనూ రౌతో శివాలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా నోటి సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. శస్త్ర చికిత్సకు అధిక మొత్తంలో ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో గ్రామస్తులను ఆశ్రయించాడు. స్పందించిన తులసిగాం యువసేన ఫౌండేషన్, గ్రామ యువకులు రూ.24,600 సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడికి శనివారం అందజేశారు.

షైనింగ్ స్టార్స్‌కు విద్యార్థులు ఎంపిక

సంతబొమ్మాళి: పదవ తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్‌గా ఎంపికయ్యారు. దండుగోపాలపురం పాఠశాలకు చెందిన చెక్క సమజ్ఞ, సంతబొమ్మాళికి చెందిన కొన్న వసంత, ఉంకిలి షణ్ముఖరావు, బోరుభద్ర పాఠశాలకు చెందిన పట్నాన శ్రీమృదుల, వల్లేవలస పాఠశాలకు చెందిన దాసరి సౌమ్యశ్రీ, సంతబొమ్మాళి ఎంజేపీ పాఠశాలకు చెందిన విశాలసాహూలు షైనింగ్ స్టార్స్‌గా ఎంపికయ్యారు. వీరందరికీ ఈ నెల తొమ్మిదో తేదీన శ్రీకాకుళంలో జరగనున్న కార్యక్రమంలో మంత్రి చేతుల మీదుగా రూ. 20 వేలు నగదు పురస్కారం, ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేస్తారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

విశ్రాంతి భవనం ప్రారంభం

కవిటి: ప్రయాణికులకు సౌలభ్యంగా ఉండేవిధంగా బొరివంకలో విశ్రాంతి భవనాన్ని ఆధునికీకరించడం శుభపరిణామమని ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ కడియాల పద్మ అన్నారు. ఆధునికీకరించిన భవనాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండలపరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.లక్ష తో పనులు చేపట్టినట్టు సర్పంచ్ బెందాళం శ్రీరాంప్రసాద్ తెలిపారు.

రెడ్‌బుక్ రాజ్యాంగం!

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలకు జరిగిన మేలుకంటే కీడే ఎక్కువ. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ కక్షసాధింపు చర్యలకు పాలకులు పాల్పడుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అన్యాయం జరిగిందని ప్రశ్నించేవారిపై సైతం అన్యాయంగా కేసులు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. సంక్షేమ పథకాల అమల్లో వివక్షతపై కూడా అడగలేని పరిస్థితి. వీటికితోడు కూటమి నాయకుల అండతో రౌడీ మూకలు చెలరేగిపోతున్నాయి. విచ్చల విడిగా మద్యం విక్రయాలు, బెట్టింగ్, పేకాట శిబిరాలు ఎక్కువైపోయాయి.

–సాక్షి నెట్ వర్క్





కోటబొమ్మాళి మండలం కిష్టుపురంలో దళిత కుటుంబపై కూటమి కార్యకర్తల దాడిలో గాయపడిన దమయంతిని పరామర్శిస్తున్న తమ్మినేని సీతారాం, పేరాడ తిలక్ తదితరులు (ఫైల్)

- కూటమి ప్రభుత్వ పాలనలో దాడులు, కక్ష సాధింపులు
- మాట్లాడినా కేసులతో భయపెడుతున్న వైనం

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో టెక్కలి నియోజకవర్గంలో దళితులు, సామాన్య ప్రజలు, వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై కక్ష సాధింపు చర్యలతో రెడ్‌బుక్ పాలన కొనసాగుతోంది. దీనికి కొన్ని ఉదాహరణలు..

- టెక్కలి మండలం చాకిపల్లి గ్రామంలో దళిత వర్గానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ చుక్క గున్నమ్మతో పాటు ఆమె కుమార్తెపై కూటమి కార్యకర్తలు దాడులు చేశారు.
- కోటబొమ్మాళి మండలం మాసాహెబ్‌పేట పంచాయతీ పరిధి సింహాద్రిపురంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే కక్షతో కూటమి కార్యకర్తలు కుట్ర పూరితంగా జిరాయితీ భూముల మీదుగా రోడ్డున వేయడమే కాకుండా ఆయా రైతులపై దాడులు చేశారు.
- కోటబొమ్మాళి మండలం యలమంచిలిలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే కక్షతో జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం పునాదులను కూల్చేశారు.
- నందిగాం మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకుడిపై అక్రమంగా కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. అనంతరం న్యాయపరంగా పోరాటం చేసి విడుదలయ్యారు.
- సంతబొమ్మాళి మండలం ఎం.నర్సాపురంలో దళిత కుటుంబపై కూటమి కార్యకర్తలు దాడులు చేశారు. జగన్నాథపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ సర్పంచ్ జోగి రాములమ్మతో పాటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు నమోదు చేశారు. మూలపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారు.
- కోటబొమ్మాళి మండలం కిష్టుపురంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే కక్షతో ఇంట్లోకి చొరబడి దంపతులపై విచక్షణ రహితంగా దాడులు చేశారు.
- కోటబొమ్మాళి మండలం మాసాహెబ్‌పేట పంచాయతీ కమలనాభపురంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే కక్షతో ఎనిమిది మంది వృద్ధులకు మూడు నెలలు పింఛన్లు నిలిపివేశారు. మరికొన్ని గ్రామాల్లో విచ్చలవిడిగా కక్ష సాధింపు చర్యలతో రెడ్‌బుక్ పాలన కొనసాగిస్తున్నారు.

రెడ్‌బుక్ పాలన కొనసాగిస్తున్నారు



దళితులు, సామాన్య వర్గాలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కూటమి నాయకులు రెడ్‌బుక్ పాలన కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో ప్రతీ గ్రామంలో గొడవలు సృష్టించి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు నమోదు చేయడం, దాడులు చేయడం చేస్తున్నారు. ఇటువంటి కక్ష సాధింపు చర్యలన్నీ ప్రజలు గమనిస్తున్నారని కూటమి నాయకులు తెలుసుకోవాలి.

–ఎస్.హేమసుందర్‌రాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, కోటబొమ్మాళి

శాంతియుతపాలన సాగాలి



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శాంతి భద్రతలు విఫలం కావడం దురదృష్టకరం. అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి, సంక్షేమాలకు దూరమై అసహనంతో ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాల్సిన కూటమి ప్రభుత్వంలోని మంత్రులు రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం పాలనలో విపరీత పోకడలను మానుకొని ఇచ్చిన హామీలను నెరవేర్చేదిశగా జనరంజక పాలనకు శ్రమించాలి.

–పిరియా విజయ, జెడ్పీ చైర్‌పర్సన్

కానరాని ఫ్రెండ్లీ పోలీసింగ్..



రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అంటూ కూటమి ప్రభుత్వంలోని మంత్రులు రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ వ్యాఖ్యలు చేయడం శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసింది. నడిరోడ్డు మీద గుంటూరులో సగటు పౌరులమీద లాఠీలు విరగగొట్టడమే మీ కూటమి ప్రభుత్వ రాజ్యాంగమా? ఫ్రెండ్లీ పోలీసింగ్ మచ్చుకైనా కనిపించడం లేదు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే సుపరిపాలన దిశగా ప్రభుత్వం చొరవ చూపాలి.

– నర్తు రామారావు, ఎమ్మెల్సీ

డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలయాపన



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు పక్కన పెట్టి, వాటి నుంచి ప్రజల్ని డైవర్ట్ చేయడానికి వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టులు చేయిస్తున్నారు. ఇదంతా రెడ్‌బుక్ రాజ్యాంగంగా చెప్పక తప్పదు. దీన్ని ప్రజలు గమనిస్తున్నారు. పాలనపైన, జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నించిన వారిపైన తిరిగి కేసులు పెట్టడం రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగమే.

–పైల దేవదాస్‌రెడ్డి, ఎంపీపీ, కంచిలి

కక్ష పూరిత రాజకీయం



రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయం సాగుతోంది. రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాక్షసపాలన చేస్తున్నారు. హామీలు మరిచి పేద, మధ్య తరగతి ప్రజలకు అన్యాయం చేశారు. ఇంటివద్దకే అందించే రేషన్ వాహనాలు తొలగించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయాల వ్యవస్థ నిర్వీర్యం చేస్తున్నారు. ఆదాయ, ఇతర ధ్రువపత్రాలు సకాలంలో ప్రజలకు అందడంలేదు. ప్రజా సంక్షేమాన్ని వదిలేసి కక్షసాధింపు పాలన చేస్తున్నారు.

– పిలక రాజలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం

అభిప్రాయాన్ని వెల్లడించలేకపోతున్నారు



కూటమి ప్రభుత్వం రాకముందు పౌరులు తమ సమస్యలను, ప్రాంతీయంగా ఉండే స్థితిగతులపై సోషల్ మీడియాలో ప్రస్తావిస్తూ పరిష్కారం పొందేవారు. కూటమి సర్కార్ ఏర్పడిన తరువాత పరిస్థితులు మారిపోయాయి. సోషల్‌మీడియాను, జర్నలిస్టులను, యాక్టివిస్టులను, దళితులను కట్టడి చేయడానికి పోలీసులతో విచారణలు, కేసులు అంటూ కట్టడి చేస్తున్నారు. ప్రభుత్వంపై ఎక్కడా వ్యతిరేకత రాకుండా కేసులు పెడుతున్నారు.

–బడగల బల్లయ్యనాయుడు, పురుషోత్తపురం, పలాస

మంత్రి అండతో విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు



టెక్కలి నియోజకవర్గంలో మంత్రి అండతో కూటమి కార్యకర్తలు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు. మంత్రి సామాజిక వర్గానికి చెందిన అధికారులతో పూర్తిగా అక్రమాలు చేయిస్తున్నారు. ఏడాది పాలనలో దాడులు, కక్ష సాధింపు చర్యలతో రెడ్‌బుక్ పాలన కొనసాగించారు. ఇటువంటి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ప్రజలు ఎంతో బాధ పడుతున్నారు.

–పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, టెక్కలి.

కుటుంబాలు నాశనం అవుతున్నాయి



ప్రస్తుత సమాజంలో యువత వేగంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. బెట్టింగ్, సెల్‌ఫోన్‌లో గేమ్‌లు, మద్యం మత్తులో అప్పులు పాలవుతున్నారు. అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకుంటున్నారు. దీంతో ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం స్పందించి బెట్టింగ్‌కు అడ్డుకట్ట వేయడంతో పాటు మద్యం మత్తుకు యువత దూరంగా ఉండేవిదంగా చర్యలు తీసుకోవాలి.

–శిలగాన భాస్కరరావు న్యాయవాది, సోంపేట మండలం

ఇంట్లోకి చొరబడి దాడి చేశారు



మా గ్రామంలో వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే కక్షతో దళిత కుటుంబం ఇంట్లోకి చొరబడి దాడులు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయకుండా కొంత తాత్సారం చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ సాయంతో న్యాయ పోరాటం చేశాం.

–బి.వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు, కోటబొమ్మాళి

భయకంపితులను చేస్తున్నారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలను భయకంపితులను చేస్తున్నారు. కిస్టుపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు గొండు మోహనరావుపై ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే టీడీపీ మూకలు దాడి చేశాయి. తిరిగి అతనిపై కేసు నమోదు చేశారు. ఉద్దానం ప్రాంతానికి చెందిన పౌరహక్కుల నాయకుడు సొర్ర డిల్లీరావును హత్య చేశారు. దీనిపై ఇప్పటికీ దర్యాప్తు పూర్తి కాలేదు. గ్రామాల్లో చిన్న చిన్న తగాదాల్లో కూడా కూటమి నాయకులు తలదూర్చి ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారు. కొన్ని బయటకు వస్తున్నాయి. కొన్ని బయట పడటం లేదు.

– దువ్వాడ రవి, అల్లుకోల, వైఎస్సార్‌సీపీ పలాస మండల కమిటీ అధ్యక్షుడు

పథకాలు అడిగితే రెడ్ బుక్ అంటున్నారు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చిన్నపిల్లాడి నుంచి పండు ముసలివారి వరకు అనేక పథకాలు ప్రవేశపెట్టి అర్హులందరికీ వారి ఖాతాలలో సంక్షేమ నిధులను జమ చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అందించమని కోరుతుంటే రెడ్‌బుక్‌లో పేరు రాస్తామని అంటున్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో అక్రమంగా కంకర తవ్వకాలు జరుపుతుంటే ప్రశ్నిస్తున్న మాలాంటివారికి పోలీసు స్టేషన్‌కు తరలించి కేసులు పెడతామని బెదిరిస్తున్నారు. సాధారణ పౌరులెవరైనా పథకాలు రావడం లేదని అంటే వారిపై తీవ్రమైన ఒత్తిడి తీసుకువస్తున్నారు. కేసులు పెట్టి బయపెట్టి కట్టడి చేస్తున్నారు తప్పితే ఏడాది అవుతున్నా ఒక్క పథకం డబ్బులైనా ఖాతాల్లో పడిన దాఖలాలు లేవు. కూటమి సర్కార్‌పై ఏడాది తిరగక ముందే ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం అవుతుంది.

– శిష్టు గోపి, 19వవార్డు, సూదికొండ

నాయకుల పరామర్శ



సత్యన్నారాయణపాఢి కుటుంబాన్ని పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ విజయ తదితరులు



ఇచ్ఛాపురం: కౌన్సిలర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

కవిటి: రాజపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సత్యన్నారాయన పాఢి తండ్రి ప్రఫుల్లచంద్రపాఢి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబాన్ని జెడ్పీచైర్‌పర్సన్ పిరియా విజయ శనివారం పరామర్శించారు. ప్రఫుల్లచంద్ర పాఢి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉద్దానంలో అనుభవజ్ఞుడైన జ్యోతిష సిద్ధాంతిగా, పురోహితుడిగా, మాజీ సర్పంచ్‌గా ప్రజాసేవలో విశేషమైన సేవలందించిన ప్రఫుల్ల చంద్రపాఢి మృతి ఈ ప్రాంతానికి తీరనిలోటని విచారం వ్యక్తం చేశారు. పరామర్శలో నాయకులు కడియాల ప్రకాష్, ఎన్ని అశోక్, వై.నీలయ్య, ఎంపీటీసీ సభ్యుడు సనపల కృష్ణారావు ఉన్నారు.

ఇచ్ఛాపురం/ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీ 12వ వార్డు బెల్లుపడ కంసాలి వీధి వార్డు కౌన్సిలర్ బుడ్డెపు ఆదిలక్ష్మి సోదరుడు ఎదురు పోలారావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తదితరులు ఆదిలక్ష్మిని పరామర్శించి సంతాపం తెలియజేశారు. పరామర్శలో కౌన్సిలర్ కుటుంబ సభ్యులు త్రినాథ్, వెంకటస్వామి, వైఎస్సార్‌సీపీ నేతలు నీలాపు డిల్లి, మామయ్య, చిట్టిబాబు ఉన్నారు.

జిల్లా మహిళా క్రికెట్ జట్టులో నిఖిలసాయికి స్థానం



జిల్లాజట్టుకి ఎంపికైన నిఖిలసాయి

ఇచ్ఛాపురం: జిల్లా మహిళా క్రికెట్ జట్టుకు అండర్–15, 19 విభాగాల్లో పట్టణానికి చెందిన పదేళ్ల దట్టి నిఖిలసాయి ఎన్నికైనట్లు ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ కోచ్ దక్కత గోపి శనివారం తెలిపారు. ఈ మేరకు విశాఖపట్టణంలో జరుగునున్న మహిళా క్రికెట్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు. జిల్లా జట్టులో స్థానం సంపాదించేలా ప్రోత్సహించిన శ్రీకాకుళం జిల్లా క్రికెట్ సంఘం పెద్దలు ఇలియాజ్ అహ్మద్, పుల్లెల శాస్త్రి, హసన్‌రాజా, బెనర్జి, కిరణ్, జి.పి.నాయుడు, అలీమ్‌ఖాన్, సుదర్శన్, జి.ఎస్.ఆర్.అకాడమీ హైదారాబాద్ డైరెక్టర్ గోపాల్‌రావులకు నిఖిలసాయి తల్లిదండ్రులు ఈశ్వరరావు, త్రివేణిలు కృతజ్ఞతలు తెలియజేశారు.

పదో తేదీ వరకు సచివాలయ సేవలకు అంతరాయం

ఇచ్ఛాపురం టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల పదో తేదీ వరకు సచివాలయసేవలు నిలుపుదల చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ శనివారం తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు ఏపీసేవా పోర్టల్‌ను మైక్రోసాఫ్ట్ అజూర్‌క్లౌడ్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రడేటా సెంటర్‌కు మార్పు చేస్తున్నందున సేవలు నిలుపుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. అందువల్ల ఆదాయ, సమగ్ర ధ్రువీకరణ, వృద్ధాప్య, వివాహ ధ్రువపత్రాలతోపాటు భూమి మ్యుటేషన్, రేషన్‌కార్డులు, ఇళ్ల పట్టాలు, వాటర్ ట్యాక్స్, పట్టణపరిపాలనకు సంబంధించి, మత్స్యశాఖ సేవలకు అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

నంబాలకు నివాళులు



నంబాల చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న న్యూడెమోక్రసీ ప్రతినిధులు

టెక్కలి: మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు చిత్రపటానికి న్యూడెమోక్రసీ రాష్ట్ర బృందం సభ్యులు శనివారం నివాళులర్పించారు. కోటబొమ్మాళి మండలం జియ్యన్నపేట గ్రామంలో నంబాల కుటుంబాన్ని పరామర్శించి అనంతరం చిత్రపటానికి నివాళులు అర్పించి జోహార్ నినాదాలు చేశారు. పార్టీ రాష్ట్ర నాయకులు పి.ప్రసాద్, తాండ్ర ప్రకాశ్, వంకట మాధవరావు తదితరులు మాట్లాడుతూ.. కేశవరావు మరణం ఉద్యమాలకు తీరని లోటు అని పేర్కొన్నారు. సొంత గ్రామంలో అంత్యక్రియలు చేయడానికి మృతదేహాన్ని అప్పగించకపోవడం, పెద్దకర్మ చేసే విషయంలో ఆంక్షలు విధించడం అన్యాయని వాపోయారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థులు ఎంపిక



జె.నీహరిక



వై.మధుప్రియ

మందస: సోండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన ఇద్దరు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్టు హెచ్ఎం బి.ఎస్.సోలమన్ శనివారం తెలిపారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన వారిలో జె.నిహారిక పింపీడియా, వై మధుప్రియ ఉన్నారు.

అమ్మవారి ఉత్సవాలు



కవిటి: అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

కవిటి : కవిటి మండలం సహలాలపుట్టుగ పంచాయతీలో సోమలాయి (శ్యామలమ్మ) అమ్మవారి గ్రామదేవత ఉత్సవాలు వైభవంగా ప్రారంభయ్యాయి. ఐదు రోజులు జరిగే ఉత్సవాల్లో భాగంగా శనివారం వేకువజామున కర్రిపుట్టుగలో అమ్మవారి తిరువీధుల ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారికి ఎదురుగా వెళ్లి స్వాగతం పలికి పాగడలు వేసి గ్రామంలోకి ఆహ్వానించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

టెక్కలిలో కోవిడ్ వార్డు ఏర్పాటు



జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కోవిడ్ వార్డు

టెక్కలి రూరల్: ఆంధ్ర ప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ టెక్కలి జిల్లా ఆస్పత్రిలో శనివారం కోవిడ్ వార్డును ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో కోవిడ్ కేసులు వస్తుండటంతో ముందుగా అప్రమత్తమైన డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారు లు ఆదేశాల మేరకు శ్రీకాకుళం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. దీంతో టెక్కలి జిల్లా ఆస్పత్రిలో ఆక్సిజన్ అందుబాటులో ఉన్న వార్డును కోవిడ్ వార్డుగా ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెంటెంట్ బి.సూర్యారావు తెలిపారు. అయితే ఇప్పటి వరకు టెక్కలిలో కేసులేవీ నమోదు కాలేదని ఆయన తెలిపారు.

ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి



మత్స్యకారులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సోంపేట మండలం బారువ మెరైన్ సీఐ ఐ.వి.రమేష్ అన్నారు. ఉప్పలాం పంచాయతీ ఎకువూరు తీరప్రాంత గ్రామంలో మెరైన్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. సుమారు 200 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచిత మందులు అందజేశారు. వైద్యులు ఎం.వాసుదేవరావు, ఇ.చైతన్య తీరప్రాంత పరిస్థితులకు అనుకూలమైన ఆరోగ్య సూచనలు, సలహాలు మత్స్యకారులకు అందజేశారు. మెరైన్ ఎస్సైలు ఎస్.శ్రీనివాస్, ఎన్.శ్రీనివాస్, ఏఎస్సైలు ఎ.మాధవరావు, పి.కోదండరావు పాల్గొన్నారు.

–సోంపేట

బక్రీద్ వేడుకలు



బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకున్నారు. సోంపేట పట్టణంలోని లాలాపేట వద్ద గల జామియా మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జామియా మసీదు పెద్దలు అల్లా సందేశాన్ని వినిపించారు. అహ్మద్ అలీ, మత గురువు అనీసుల్‌ఖాద్రీ, జోహార్‌ఖాన్, అబ్దుల్లా, ఫరీద్, అలీ, బాబుషరీఫ్, రఫీ, జిలాని పాల్గొన్నారు.

–ఇచ్ఛాపురం

రూ. 25 వేల వితరణ

పలాస: చినంచల గ్రామానికి చెందిన వ్యాపార వేత్త పాట్నూరు మేఘనాథ్ గ్రామంలో నిర్మిస్తున్న వినాయక మండపానికి రూ.25 వేలు విరాళంగా అందజేశారు. భవిష్యత్తులో మండపం నిర్మాణానికి అవసరమైన ఎటువంటి సహాకారమైన చేస్తానని హామీ ఇచ్చారు. చినంచ కొత్త వీధి యువజన సంఘం సభ్యులు మేఘనాథ్‌ను అభినందించారు.